www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 19 నవంబర్ 2025
5
అన్నమయ్య



## తహశీల్దార్ దురుసు ప్రవర్తన సరికాదు : బివైఎస్


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్‌టిఐ యాక్ట్ కింద సమాచార నిమిత్తం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే తమపై తహశీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించి, బయటకు గెంటేసే ప్రయత్నం చేశారని బిఎస్‌పి బహుజన యువసేన నాయకులు పునీత్ ఆరోపించారు. కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గొల్లపల్లికి చెందిన జయకుమార్ తల్లి రమాదేవి పేరు మీద బి.కె.పల్లి కాలనీలో ఉన్న ఇంటి స్థలంలో నివాసం ఏర్పాటు చేసుకుంటుండగా కొంతకాలం వచ్చి ఈ స్థలం తమది కేటాయించారని పోలీసులకు ఫిర్యాదు చేసి పనిని నిలిపేశారని పేర్కొన్నారు. జయకుమార్ ఆ స్థలం ఎవరి పేరుమీద ఉందో వివరాలు ఇవ్వాలంటూ 20 రోజుల క్రితం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌టిఐ యాక్ట్ కింద దరఖాస్తు చేసుకున్నామన్నారు. సమాచారం ఇవ్వడంలో తహశీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. 30 రోజుల్లోపు తాము సమాచారం ఇవ్వకపోతే చాలెంజింగ్ చేసుకోవచ్చని తహశీల్దార్ తెలిపారు. బివైఎస్ నాయకుడు పునీత్ తమ విధులకు ఆటంకం కలిగించారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

# 'కొప్పర్తి' పైప్‌లైన్‌కు మోక్షమేదీ?

- జిఎన్ఎస్ఎస్ కేటాయింపుల 'హా'మీ
- కదలని 'ఉక్కు' సర్వరాయసాగర్ పనులు
- కాగితాల్లోనే తెలుగుగంగ లీకేజీ ప్రతిపాదనలు
- విశాఖ సదస్సులో జిల్లాకు పెట్టుబడులేవీ
- నేడు పెండ్లిమర్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు రాక





ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లా అపరిష్కృత సమస్యలకు నిలయంగా మారింది. కొప్పర్తి పారిశ్రామికవాడకు నీటి సరఫరా పైప్‌లైన్ పనుల పురోగతి ప్రశ్నార్థకం మొదలుకుని కదలని ఉక్కు పరిశ్రమ, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు రూ.వెయ్యి కోట్లు, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్ రిజర్వాయర్ లీకేజీ, గండికోట, పైడిపాలెం, సోమశిల సాగునీటి ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం వరకు నిట్టూర్పుల్లోనే పరిస్థితి నెలకొంది. ఎస్‌హెచ్ రహదారులకు కేటాయించిన భూములకు పరిహారం చెల్లింపుల సమస్య తేలడంలేదు. విశాఖపట్నంలో భాగస్వామ్య సదస్సులో పెట్టుబడుల వరద పారినట్టు ప్రచారం చేసుకుంటున్న సంగతి తెలిసిందే. రూ.13 లక్షల కోట్ల పెట్టుబడుల్లో కడప, అన్నమయ్య జిల్లాలకు ఎటువంటి పాత్ర లేకపోవడం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది. దేశంలోని భూగర్భ బేసిన్‌లో తనదైన ప్రత్యేకత కలిగిన జిల్లాలో పారిశ్రామిక ప్రగతి ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు నాయకుల దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో జిల్లాకు వచ్చిన పారిశ్రామిక సంస్థలకు రాజకీయ చిత్తశుద్ధి కొరవడిన ఫలితంగా సాకారానికి నోచుకోవడం లేదు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు కమలాపురం నియోజక వర్గంలోని పెండ్లిమర్రి మండల పర్యటన నేపథ్యంలో కథనం...

జిల్లా ప్రగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెతను తలపిస్తోంది. వ్యవసాయ, సాగునీటి, పారిశ్రామిక రంగాల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో సాగునీటి ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తానన్న హామీ అమలుకు ఆమడదూరంలో నిలిచింది. హామీల అమలుకు నోచుకోని ఏడాది మేలో కడపలో నిర్వహించిన మహానాడులో జిఎన్ఎస్ఎస్ కెనాల్ పనులకు రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తానన్న హామీ అమలుకు నోచుకోలేదు. మహానాడు ముగిసిన 12 రోజుల వ్యవధిలో జమ్మలమడుగు మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లి-పెద్దదండ్లూరు గ్రామాల సమీపంలో ఒక్క పరిశ్రమ పనులు మొదలుపెడతామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. ఆగస్టు 12 ముగిసిన అనంతరం పత్రికల కథనాలు గుర్తు చేసిన నేపథ్యంలో బలవంతంగా కంపెనీ ప్రతినిధులు, కలెక్టర్ హడావుడి చేయడం మినహా ఆశించిన పురోగతి కనిపించని పరిస్థితి. నాలుగు నెలలు గడుస్తున్నా పూర్తి స్థాయిలో పట్టాలకు ఎక్కిన దాఖలాల్లేవు. ముఖ్యమంత్రి కడప జిల్లా పర్యటన ఉందనే వాతావరణంలో పెండ్లిమర్రిలో ఆగ్రోస్, ఇతర స్కిల్ పరిశీలన, అన్నదాత సుఖీభవ కార్యక్రమ ప్రారంభోత్సవం పేరిట జిల్లా వ్యవసాయశాఖ హడావుడి చేయడం మినహా ప్రజలకు ఇచ్చిన హామీ అమలు చేయడం ద్వారా మెప్పించే పనులు చేపట్టడం లేదనే వాదన వినిపిస్తోంది. కొప్పర్తి పారిశ్రామికవాడకు రూ.150 కోట్లతో సాగుతున్న పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గండికోట నిర్వాసితులకు రూ.2.50 లక్షల పెండింగ్ పరిహారం ఆరేళ్లుగా అమలుకు నోచుకోలేదు. సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్ లీకేజీలకు ముగింపు ఎప్పుడో తెలియడం లేదు. ప్రభుత్వం ఈ నెల 14, 15వ తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో కడప జిల్లాలోని వైఎస్ఆర్ ఎలక్ట్రానిక్ క్లస్టర్ ఉన్నప్పటికీ ఒక్క సెమికాన్ పరిశ్రమ మొదలుకుని ఎటువంటి పరిశ్రమలు రాకపోవడంపై రాష్ట్ర పాలకుల్ని జిల్లా ప్రజానీకం నిలదీస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

# 8 నెలల్లో క్రిటికల్ కేర్ యూనిట్

- ఆస్పత్రిలో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేస్తాం
- త్వరలో ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులోకి..
- జిల్లా ఆస్పత్రిగా ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు
- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



కాన్పుల వార్డును పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

ఎనిమిది నెలలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను పూర్తి చేస్తామని రవాణా, యుజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల వార్డును ప్రారంభించారు. కష్టతరమైన కాన్పుల వార్డును, పుట్టిన పిల్లల కోసం ఏర్పాటు చేసిన వార్డును, మెటర్నిటి కాన్పులు వార్డును, ఐదు డయాలసిస్ యూనిట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య రంగంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి ఎంతో చరిత్ర ఉందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నే విధంగా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిని తయారు చేశామన్నారు. 16 మండలాలకు ఈ ఆసుపత్రి కేంద్ర బిందువుగా ఉన్నందున రోజూ సుమారు వేయి మంది రోగులు ఈ ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారన్నారు. త్వరలో ఆక్సిజన్ ప్లాంట్‌ను కూడా అందుబాటులోకి తేస్తామన్నారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కేంద్రం ఆసుపత్రిగా మార్చాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 150 పడకలున్నాయని, అవి సరిపోక రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అందుకు మరో 100 పడకలు పెంచుతామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో ఎన్నో పథకాలు తీసుకొని వచ్చామని, రూ.23 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపనలు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం క్రిటికల్ కేర్ యూనిట్ పిల్లర్ల దశకు చేరుకుందన్నారు. ప్రస్తుతం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో 19 డయాలసిస్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కిడ్నీ బాధితులు కడప, తిరుపతి వంటి దూర ప్రాంతాలకు పోనవసరం లేకుండా రాయచోటి ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని సూచించారు. కూటమి ప్రభుత్వం కిడ్నీ బాధితులకు రూ.10వేల పెన్షన్ ఇవ్వనున్నామని చెప్పారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ, పెండింగ్‌లో ఉన్న పనులను వచ్చే ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీప్రసాద్, ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ బండారు కిరణ్‌కుమార్, అనస్తీషియా డాక్టర్ వెంకటశివ, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ డెవిడ్ సుకుమార్, డాక్టర్ కోటేశ్వరమ్మ, డాక్టర్ నిలోఫర్ బేగం, డాక్టర్ జీనత్ బేగం, డాక్టర్ శైలేష్, డాక్టర్ రమేష్ రాజు, డాక్టర్ ఎజాజ్, నర్సింగ్ సూపరింటిండెంట్ పద్మావతమ్మ, హెడ్ నర్సులు విజయ కుమారి, విజయలక్ష్మీ, పద్మావతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్లు, ట్రైనీ నర్సింగ్ విద్యార్థినులు, పట్టణ టిడిపి అధ్యక్షులు బోనముల ఖాదర్‌వలి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఖాదర్ బాష, మహమ్మద్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

### ఆస్పత్రికి వంద దుప్పట్లు వితరణ

ప్రభుత్వాస్పత్రికి తెలుగు దేశం పార్టీ నాయకులు శ్రీనివాసులరెడ్డి రవాణా, యుజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో వంద బెడ్‌షీట్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్‌కు అందజేశారు. శ్రీనివాసులరెడ్డి దాతృత్వం అభినందనీయమని ఈ సందర్భంగా మంత్రి కొనియాడారు. అనంతరం మంత్రి టిడిపి నాయకులు శ్రీనివాసుల రెడ్డిని శాలువతో సన్మానించారు.

# జిల్లాకు ఉత్తమ జాతీయ జలశక్తి పురస్కారం

**- రాష్ట్రపతి నుంచి పురస్కారం అందుకున్న కలెక్టర్ నిశాంత్ కుమార్**



రాష్ట్రపతి నుంచి పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి- రాయచోటి

ఉత్తమ జాతీయ జలశక్తి పురస్కారాన్ని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అందుకున్నారు. ఈ పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ఆయన మంగళవారం అందుకున్నారు. జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని జలవనరులు నదుల అభివృద్ధి తదితర అంశాలలో 2024 సంవత్సరానికి గాను 6వ జాతీయ జలశక్తి అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నీటిని సంరక్షించడం, సమర్ధవంతంగా నిర్వహించడం, నీటి ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం, ఉత్తమ నీటివినియోగ పద్ధతులను అవలంభించడం, తదితర కార్యక్రమాలు చేపట్టినందుకు అన్నమయ్య జిల్లాకు జాతీయస్థాయిలో ఉత్తమ జలశక్తి అవార్డు లభించింది. జాతీయ స్థాయిలో దుబ్బిగానిపల్లి గ్రామపంచాయతీకి ప్రథమ స్థానం లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురస్కారం లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మదనపల్లి మండలం కొత్తవారిపల్లె పంచాయితీ దుబ్బిగానిపల్లి గ్రామంలో సుమారు రూ.75 లక్షలతో వాటర్‌షెడ్ పనులు నిర్వహించారు. 2024 డిసెంబర్‌లో కేంద్ర జలశక్తి బృందం సభ్యులు ఈ వాటర్‌షెడ్ పనులను పరిశీలించారు. వర్షాలకు వాటర్‌షెడ్‌లో నీరునిలిచి సత్ఫలితాలనిచ్చాయి. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కార్మికులకు పెండింగ్ జీతాలివ్వండి

**- ఎపి గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు**



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్‌కు 5 నుండి 12 నెలల పెండింగ్ జీతాలివ్వాలని ఎపి గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సురేంద్ర బాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు ప్రతి నెలా వేతనాలివ్వడంలో అధికారులు విఫలం అవుతున్నారని తెలిపారు. పన్నులు వసూలు చేసిన జనరల్ ఫండ్ మొదలుకుని 15వ ఆర్థిక సంఘం నిధులను కార్మికులకు జీతాలివ్వకుండా ఇష్టానుసారం దుర్వినియోగం చేస్తున్నారని చెప్పారు. ఉన్నతాధికారులు తనిఖీలు మరచడం వల్లనే స్థాయిలో నిధులు పక్కదారి వెళ్తున్నాయని అన్నారు. కరోనా కాలంలో పని చేసిన కార్మికులకు జీతాలు ఇవ్వక పోవడం దారుణం అన్నారు .కొబ్బరినూనె, సబ్బులు. మాస్కులు నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలన్నారు. పెండింగ్ జీతాలపైనా, 13 పిఆర్‌సి అమలు కోసం డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించే సిఐటియు అఖిల భారత మహాసభలో కార్మికుల అభివృద్ధికి తీర్మణాలు చేసి నిరవధిక పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎ.వి.రమణ, దేవరాయలు, ఆంజనేయులు, చెన్నయ్య, లక్ష్మీదేవి, సుభద్ర, రెడ్డెయ్య పాల్గొన్నారు.

# అనాథ పిల్లలకు అండగా శిశు గృహం




ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా శిశు గృహ సిబ్బంది

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అనాథ పిల్లలకు మంచి కుటుంబాన్ని అందించడమే శిశుగృహ ముఖ్య ఉద్దేశం అని అన్నమయ్య జిల్లా శిశు గృహ సిబ్బంది అన్నారు. మంగళవారం చెన్న ముక్కపల్లిలోని యానాది కాలనీలో అంతర్జాతీయ దత్తత మాసోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను ప్రేమ పూర్వక కుటుంబాలలో చేర్చుతామని చెప్పారు. అనాథ పిల్లలను ప్రభుత్వం శిశు గృహాల ద్వారా దత్తత తీసుకుంటామని పేర్కొన్నారు. మాతృత్వం ఒక వరం అని దత్తత అందుకు మరో మార్గం అన్నారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు దత్తతకు కావాల్సిన అర్హత గురించి వివరించారు. అలాగే అనాథ పిల్లలు, తల్లిదండ్రులు వదిలేసిన పిల్లలు శిశు గృహ ద్వారా సంరక్షణలో ఉంటారని తెలిపారు. ప్రజలు పుట్టిన శిశువు నుంచి 18 సంవత్సరాల పిల్లల వరకు ఎవరైనా అనధికారంగా దత్తత తీసుకున్నట్లయితే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిశు గృహ దత్తత విభాగం మేనేజర్ ఆర్.సుప్రియ, సోషల్ వర్కర్ టి.గాయత్రి, శిశు గృహ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



దొరిచెరువులో జలహారతి పూజలు చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

# వెలిగల్లు నీటితో చెరువులు నింపుతాం

**- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**


ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాల్లోని చెరువులను నింపుతామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దొరిచెరువులో జలహారతి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుడి, ఎడమ కాలువలను మరమతులు చేయించి దూరంగా ఉన్న చెరువుల కూడా నీరు నింపుతామని తెలిపారు. మూడు మండలాల్లోని 69 చెరువులు నిండి జలకళను సంతరించుకున్నాయన్నారు. రాయచోటి, రామాపురం, గాలివీడు, చిన్నమండెం మండలాలకు తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. కాలువలకు మరమ్మతులు చేయించి 24 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగోళ్ల రెడ్డయ్య యాదవ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి, బిసి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, మాజీ ఎంపిపి ఉమాపతిరెడ్డి, టిడిపి బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు దిన్నెపాడు శ్రీనివాసులు, దేన్నెపాడు రవిరాజు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు అజంతుల్లా, నాయకులు సిద్ధ వెంకటరామిరెడ్డి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర సాధికార సమితి సభ్యులు మండ రామాంజనేయులు, మాజీ ఎంపిటిసి రాజేందర్‌రెడ్డి, వెలిగల్లు ప్రాజెక్టు ఇఇ భరత్ కుమార్‌రెడ్డి, డిఇ రమణయ్య, మైనర్ ఇరిగేషన్ జెఇ బాషా పాల్గొన్నారు. అనంతరం రూ.15 లక్షలతో నిర్మించిన ఆస్పత్రికి వెళ్లే రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు.

## రెవెన్యూ సమస్యలపై స్పందించండి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రెవెన్యూ సమస్యలపై సత్వరమే స్పందించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై ప్రజలు భూ సమస్యలపై అధికంగా తహశీల్దార్ కార్యాలయాలకు తిరుగుతున్నారని, వారి అర్జీలను తీసుకొని క్షుణ్ణంగా పరిశీలించి న్యాయమైన సమస్యలను కాలయాపన చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు సమర్పించే అర్జీలపై ఏవైనా లోటు పాట్లు ఉంటే, ఆ అర్జీలను వెంటనే ఉన్నతాధికారులకు సిఫారసు చేసి దానిపై తగు సలహాలు సూచనలు తీసుకుని ప్రజా సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో సిసి కెమెరాల ఏర్పాటుపై సంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ కార్యాలయం అంటే లంచాలు తీసుకునేవారినే అపోహ ప్రజల్లో ఉందని వాటిని తొలగిస్తూ ఎక్కడా ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. మండల పరిధిలో నిషేధిత భూములు, ప్రభుత్వ భూములు ఆక్రమణ జరగకుండా, రిజిస్టర్లు కాకుండా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. సమావేశంలో తహశీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డిఆర్‌ఒ మధుసూదన్‌రావు

## డిఎక్స్‌ఎడ్జ్‌తో 'మిట్స్' ఎంఒయు

ప్రజాశక్తి-మదనపల్లె




ఒప్పంద పత్రాన్ని తీసుకుంటున్న రవికుమార్

విశాఖపట్నంలో జరిగిన వికసిత్ భారత్ విజన్ సమ్మిట్-2025లో డిఎక్స్‌ఎడ్జ్ సంస్థతో మిట్స్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. భారత ప్రభుత్వంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ వారు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ), నితి ఆయోగ్ సంయుక్తంగా దేశ అభివృద్ధి లక్ష్యాలతో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖపట్నంఃలో విక్సఇత్ భారత్ విజన్ సమ్మిట్-2025ను నిర్వహించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ టి.జి.రవికుమార్ ఒప్పంద పత్రాన్ని అందుకున్నట్లు ఉపకులపతి తెలిపారు. అధునాతన సాంకేతిక నైపుణ్యాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ, పరిశోధన ఆవిష్కరణ అవకాశాలు, డిఎక్స్‌ఎడ్జ్ సంస్థతో కలిసి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు యూనివర్సిటీలోని అధ్యాపకులకు,విద్యార్థులకు అందించనున్నటు తెలిపారు. కార్యక్రమంలో డిఎక్స్‌ఎడ్జ్ సంస్థ ప్రతినిధులు, రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకర్‌రెడ్డి చేతుల మీదుగా టి.జి.రవి కుమార్ అందుకున్నారు.

## వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-రాజంపేట

వాల్మీకులను ఎస్‌టి జాబితాలోకి చేర్చాలని బివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అంజి డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాల్మీకి కులస్తులను ఎస్‌టి జాబితాలోకి చేరుస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వాల్మీకుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వాల్మీకులు అన్ని రంగాలలోనూ వెనుకబడి ఉన్నారని, వారి సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలన్నారు. పేరుకు మాత్రం చైర్మన్, డైరెక్టర్లు పదవులు ఇస్తున్నప్పటికీ అవి అలంకారప్రాయంగానే మిగిలిపోతున్నాయన్నారు. 2019 ఎన్నికల సమయంలో కూడా వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి వాల్మీకి కులస్తులకు తప్పనిసరిగా ఎస్‌టి జాబితాలోకి చేరుస్తామని హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వాల్మీకి కులస్తులను పట్టించుకోలేదన్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి రెండు పార్టీలు వాల్మీకి కులస్తులను వారి స్వార్ధ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా చాలామంది వాల్మీకి కులస్తులపై కేసులు నమోదయ్యాయని, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. 2026 నాటికి వాల్మీకి కులస్తులను ఎస్‌టి జాబితాలోకి చేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు సుధాకర్, రవి, శ్రీను, పరమేష్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. మంగళవారం తన నివాసం దగ్గర పలు సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, వాటి పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకున్న వెంటనే వాటిని పరిష్కరించడం అధికారుల ప్రథమ కర్తవ్యమన్నారు. ప్రతిరోజు ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందన్నారు.

## ఎగువకొనకుంట్లవారిపల్లె దారి మూసివేత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామాల్లో నెలకొన్న చిన్నచిన్న సమస్యల నడుమ స్థానికంగా ఉన్న కొందరు మండలంలోని ఎగువకొనకుంట్లవారిపల్లె గ్రామానికి దారి లేకుండా 20 రోజులుగా రోడ్డుకు అడ్డంగా మట్టితోలి దారిని పూర్తిగా మూసేశారు. గ్రామంలోని 29 కుటుంబాలు ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోగులు ఆసుపత్రికి వెళ్లాలన్నా, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా, రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లాలన్నా, వ్యవసాయ పొలాల నుంచి ధాన్యం, గడ్డి, వ్యవసాయ పనిముట్లు, తదితర వస్తువులు ఇళ్లకు, పొలాలకు తరలించుకోవాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారిని తెరవాలని అడిగితే స్థానికంగా గొడవలకు దిగడం, ఘర్షణలు పడడం చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. వారిని ఎదిరించే శక్తి మాకు లేదని అధికారులకు, పోలీసులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దారిని మూసేసిన వారిపై చర్యలు తీసుకొని వెంటనే దారి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై తహశీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డిని వివరణ కోరగా పంచాయతీ సెక్రటరీ, విఆర్‌ఒలను సంఘటనా స్థలానికి పంపామని, అయినా వారు దారికి అడ్డుగా వేసిన మట్టిని తొలగించలేదన్నారు. వారిపై కేసు నమోదు చేయమని తాలూకా పోలీసులకు రెఫర్ చేశామన్నారు. మూసేసిన దారిని వెంటనే తెరవకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



బి.కొత్తకోట : కోటి సంతకాల కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

## వైద్య కళాశాలల ప్రయివేటీకరణపై ఉద్యమిద్దాం : వైసిపి

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

రాష్ట్ర ప్రభుత్వం పిపిపి విధానం ద్వారా వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేస్తూ పేదలకు వైద్య విద్యను దూరం చేస్తోందని మదనపల్లి వైసిపి సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని చల్లావారిపల్లె, నల్లంవారిపల్లె, వెంగంవారిపల్లె, అగ్రహారం, నిమ్మనపల్లెలో మదనపల్లి నియోజకవర్గ వైసిపి పరిశీలకులు అనూషరెడ్డి, వివిఎస్‌రెడ్డి, మండలాధ్యక్షులు శ్రీనివాసుల రెడ్డి, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులతో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. పేదలు వైద్య కళాశాలలో వైద్యం పొందాలన్నా డబ్బులు చెల్లించి వైద్యాన్ని కొనుక్కోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణ పనులను చేపట్టారన్నారు, కూటమి ప్రభుత్వం వాటి నిర్మాణ పనులను చేపట్టకుండా ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించి కమీషన్లు దండు కోవడానికి ప్రణాళికలను రచించిందన్నారు. మాజీ సిఎం వై.ఎస్.జగన్ పిలుపు మేరకు రాష్ట్రంలో కోటి సంతకాలను సేకరించి గవర్నర్‌కు అందించనున్నట్లు తెలిపారు. కూటమి పాలనలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ఐ రమణారెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, హేమంత్ కుమార్, నాగరాజారెడ్డి, చంద్రా యుడు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పిపిపి విధానానికి వ్యతిరేకంగా తంబ ళ్లపల్లె నియోజకవర్గం,పెద్దతిప్పసముద్రం మండలంలో వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బూచుపల్లి,సంపతి కోట,మల్లెల గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎమ్మెల్యే ద్వారక నాథరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రయివేట్ పరం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్, నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డి హరి, బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ కంచి కళ్యాణ్ కుమార్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీలకు 'జ్ఞానదీప్తి' విద్యార్థి

**ప్రజాశక్తి - నందలూరు :** పాఠశాల క్రీడా పోటీలలో భాగంగా రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీ లకు మండలంలోని జ్ఞాన దీప్తి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని గుగ్గిళ్ళ స్వాతి ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ అద్దంకి జానకినాథ్ పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో అయన మాట్లా డుతూ కడపలో జరిగిన ఎంపికలో ఉమ్మడి కడప జిల్లా నుంచి అనేకమంది విద్యార్థినులు పోటీ పడగా వారినుంచి అండర్-17 విభాగంలో స్వాతి ఎంపిక కావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిడిగంటి లక్ష్మి, ఎఐ వెంకటరమణ, ఉపాధ్యాయులు అరుణ్ కుమార్, లక్ష్మీ, కోచ్ నాగేంద్ర ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బేస్‌బాల్ బాలుర, బాలికల జట్లు ఎంపిక

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు :** ఎస్‌జిఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో ఎస్‌జిఎఫ్ అండర్-19 బాలుర జట్టు, బాలికల జట్టును ఎంపిక చేసినట్లు కడప జిల్లా ఎస్ జిఎఫ్ అండర్-19 అధ్యక్షులు టివిఎన్‌వి వెంకటేశ్వర్లు తెలిపారు. వీరు 2026 జనవరిలో ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని డివిఇఓ, కడప ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రమోహన్‌రాజు తెలిపారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి-కలికిరి :** తిరుపతిలోని ఎస్‌వి వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మండలంలోని వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. రెండవ రోజు మేడుకుర్తి గ్రామం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు జిల్లా అంధత్వ నిర్వహణ సంస్థ అన్నమయ్య వారి సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పరిసరాలను శుభ్రపరచి ప్లాస్టిక్ వాడకంతో దుష్పలితాలు, నిర్మూలనపై పిల్లలకు అవగాహన కల్పించారు. చివరిగా పాఠశాలలోని విద్యార్థులకు స్వచ్ఛభారత్ అభియాన్ అనే అంశంపై చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రదీప్, అసోసియేట్ డీన్ రేప్రజెంటేటివ్ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, వ్యవసాయ కళాశాల, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## పంట మార్పిడితో భూమి సారవంతం : జెడి

**ప్రజాశక్తి లక్కిరెడ్డిపల్లి :** పంట మార్పిడి వలన భూమి సారవంతం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం దీన్నె పాడు గ్రామంలో వేరుశనగ కంది ఉలవ పంటలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడి వలన క్రాప్ రొటేషన్ నేలలోని పోషకాలు సముతుల్యం కావడం ఏ పంట సాగుచేసిన వ్యాధులు వ్యాధులు ఆశించకుండా ఉంటాయన్నారు. దిగుబడులు పెరిగి పంట నాణ్యత వస్తుందన్నారు. జిల్లాలో రబి సీజన్‌లో చాలామంది ఉలవలు ఎక్కువ సాగు చేశారని పంట మాత్రం ఆశాజనకంగా ఉందన్నారు. వాతావరణానికి అనుకూలంగా నువ్వులు రకాలు వంటి పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం మండలంలో ప్రతి చెరువులో నీరు అందుబాటులో ఉందని రబీలో వేరుశనగ తో పాటు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఏ పంట సాగు చేసిన రైతులు శాస్త్రీయంగా ఎర ువులు వాడాలన్నారు. ఎక్కువగా ప్రకృతి ఎరువులు, కషాయాలు వాడితే ఖర్చు తగడుతో పాటు పంటకు రక్షణ మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో రాజకుమారి ఎపి సిఎస్‌ఎఫ్ రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న జెడి శివనారాయణ



# ఇంటి పన్ను ఆన్‌లైన్‌లోనే కట్టించాలి : డిఎల్‌పిఒ

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

గ్రామ సచివాలయాల నుంచి ప్రజలకు ఉత్తమ సేవలను అందించాలని, ఇంటి పన్నును ఇకపై ఆన్‌లైన్‌లోనే కట్టించాలని మదనపల్లె డివిజన్ లెవెల్ డెవలప్మెంట్ ఆఫీసర్ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో ఆయన పర్యటించి రెడ్డివారిపల్లెలోని సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం బండ్లపై గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రికార్డులను, ఉద్యోగుల రిజిస్టర్లను, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన అర్హుల, అనర్హుల జాబితాలను తనిఖీ చేశారు. కొందరు సచివాలయ ఉద్యోగులు సమ యపాలన పాటించకుండా మధ్యాహ్నమే ఇంటికి వెళుతున్నారని తమకు ఫిర్యాదులు అందాయన్నారు. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందు బాటులో ఉండాలని వారికి ఉత్తమ సేవ లను అందించాలని సూచించారు. సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులపై తక్షణ చర్యలు తీసుకోవడానికి వెనకా డబోమని హెచ్చరించారు. పంచాయతీ కార్యద ర్శులు ఇకపై ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లోనే కట్టించాలన్నారు. ఎక్కడైనా మ్యానువల్‌గా ఇంటి పన్నులకు సం బంధించిన రసీదులను ఇస్తే సంబంధించిన కార్యదర్శులపై చర్యలు తీసుకుం టామని తెలి పారు. ప్రజలకు కూడా పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ రసీదుపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సకాలంలో పన్నులను వసూలు చేసి పంచాయతీకి ఆదాయాన్ని సృష్టించాలని తెలిపారు. గ్రామాలలోని ప్రతి ఇం టి నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని, అక్కడ ఎరువును తయారు చేసి విక్రయించి సంపదను సృష్టించాలన్నారు. గ్రామాలలో పారిశుధ్యం, శుద్ధమైన తాగునీరుకు ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. సచి వాల యాల్లో ఇకపై తరచుగా తనిఖీలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి మహమ్మద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



బండ్లపై సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న డిఎల్‌పిఒ అమర్నాథ్‌రెడ్డి

# వేంపల్లి ఫిరోజ్ సేవలు అభినందనీయం

### - సినీ నటుడు సప్తగిరి

**ప్రజాశక్తి-కలికిరి**

దేశ సేవలో సైనికుడు వేంపల్లి ఫిరోజ్ సేవలు అభినందనీయమని హీరో సప్తగిరి అన్నారు. తిరుపతి కెఎస్ ఈవెంట్స్ అధినేత సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కలికిరి వాసి బిఎస్‌ఎఫ్ జవాన్ ఫిరోజ్‌కు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి హీరో సప్తగిరి హాజరయ్యారు. మొదటగా ఆయన ఫిరోజ్‌కు పూల బుక్కేతో ఆహ్వానించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సప్తగిరి మాట్లాడుతూ ఫిరోజ్ చాలా కాలంగా నాకు మంచి మిత్రుడని, ఆయన 2016 నుంచి 2022 వరకు కలకత్తా ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందంలో సభ్యుడుగా ఉంటూ కోవిడ్-19 కాలంలో కోవిడ్ బారిన పడిన ఎంతో మం దిని కాపాడారని చెప్పారు. అనాథ మృత దేహాలకు అంత్యక్రియలు చేశారని, వరదల సమయంలో బాధితులకు నీళ్ళు, ఆహారం, మందులు పంపిణీ చేశార న్నారు. అమర్నాథ్ యాత్రకు వెళ్లిన ప్రయాణికులకు ఆక్సిజన్ అందజేయడం, యాత్రికులు ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొంటే వారిని ఆదుకోవడం వంటి సేవా కార్యక్ర మాలు నిర్వహించాని అభిందించారు. పాకిస్తాన్‌పై ఆపరేషన్ సింధూర్ కూడా పాల్గొని ఎంతో గుర్తింపు పొందాడని కొనియాడారు. ఈ సంద ర్భంగా బిఎస్‌ఎఫ్ జవాన్ ఫిరోజ్ మాట్లాడుతూ నా సేవలను సినీ నటులు సప్తగిరి గుర్తించడం ఆనందదాయకమని అన్నారు. మీలాంటి ప్రముఖుల అభినందనతో, ప్రోత్సాహంతో మాలాంటి జవాన్లు దేశం కోసం మరింత సేవలు అందిస్తామని అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేస్తామన్నారు.



ఫిరోజ్‌ను సన్మానిస్తున్న సప్తగిరి

# విద్యార్థుల సంఖ్యను పెంచాలి : ఆర్‌జెడి



పాఠశాలలో వంట తయారీని పరిశీలిస్తున్న ఆర్‌జెడి శ్యాముల్

**ప్రజాశక్తి- కలకడ**

ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో విద్యను బోధించి ,విద్యార్థుల సంఖ్యను పెంచాలని కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్యాముల్ ఆదేశించారు. మండలంలోని కదిరాయచెరువు జడ్‌పి హైస్కూల్‌లో మంగళవారం అకస్మికంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన గతంలో ఈ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు ఉండే వారని, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తగ్గడం ఏమిటని ఉపాధ్యాయులను అడిగారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో ప్రయివేట్ పాఠశాలల ప్రాబల్యం తక్కువగా ఉండటంవల్ల విద్యార్థులు అధికంగా ఉండేవారని, ప్రస్తుతం ప్రయివేట్ పాఠశాలల ప్రాబల్యం ఎక్కువగా ఉండటంతో తల్లిదండ్రులు అటువైపే మక్కువ చూపుతున్నారని ఆర్‌జెడికి వివరించారు. వచ్చే ఏడాది విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు నిర్మించిన మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీలు నిర్వహించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీం చారు.కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు : ఎంఇఒ

**ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి**

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు మండల విద్యాశాఖ అధికారి చక్రే నాయక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయవారోత్సవాల కార్యక్రమం నిర్వహించారుఉ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒలు చక్రి నాయక్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల వికాసానికి ఎంతగానో తోడ్పడతాయని చెప్పారు. విద్యార్థులకు ఆటలు పోటీలు వ్యాసరచన చిత్రలేఖనం వక్తత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు గ్రంథాలయ అధికారి సుబ్రహ్మణ్యం విద్యార్థులకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమరావతి, ఉపాధ్యాయులు వేమిరెడ్డి సుబ్బారెడ్డి రోజమ్మ, సువర్ణముఖి, జిల్లా బిసి సంఘం ఉపాధ్యక్షులు భాస్కర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ రాజశేఖర్, సిఆర్‌పి రామ్మోహన్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి పేర్కొన్నారు గ్రంథాలయాల ప్రాముఖ్యత అనే అంశంపై బాపూజీ మున్సిపల్ హైస్కూల్, బూన్ హైస్కూల్, జిల్లా పరిషత్ స్కూల్, జి.ఆర్.టి ఇంగ్లీష్ మీడియం స్కూల్, జ్ఞానోదయ స్కూల్ విద్యార్థులకు గ్రంథాలయంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో బూన్ హైస్కూల్ కరస్పాండెంట్ శంకర్, హెచ్‌ఎం రమాదేవి,ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి:** విద్యార్థులకు వివిధ పోటీలను గ్రంథాలయ అధికారి విజయకుమార్ నిర్వహించారు. గ్రంథాలయాల పైన మక్కువ పెంచడానికి సృజనాత్మకతను పెంపొందిం చడానికి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, భాష నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి విద్యార్థులను గొప్ప వక్తలుగా తీర్చిదిద్దడానికి వకృత్వ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీలలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, జడ్‌పి ఆధునిక పాఠశాల కలికిరి విద్యార్థులు, శ్రీ విద్యా జ్యోతి చిల్డ్రన్స్ అకాడమీ చింతపర్తి విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతపర్తి విద్యార్థులు పాల్గొన్నారు.**కలకడ:** విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించినట్లు కలకడ గ్రంథాలయ శాఖ అధికారి అమరనాథ తెలిపారు. మండలంలోని బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) నందు ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన క్విజ్ డ్రాయింగ్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. 20న గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. **బి.కొత్తకోట :** కురుబలకోట శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని గ్రంథాలయ అధికారి బి.చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.నాగమణి,రెడ్డి రాధా,మస్తాన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** లైబ్రేరియన్ జిలానిబాషా ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల, ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్ పోటీలు జరిపారు. విద్యార్థులు ఎంతో ఉత్సా హంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు రోజున బహుమ తులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కరస్పాండెంట్ విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయ అధికారి పసుపులేటి రమాపతి మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణిస్తానే ఆటల్లో కూడా రాణించాలని, అప్పుడే శారీరం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసుంధర, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లి : బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు


## బాధితులకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి :** నెల 16వ తేదీన లకిరెడ్డిపల్లి లోని కోర్టు వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన అజయ్ కుటుంబానికి నలంద కరస్పాండెంట్ బాలసుబ్రమణ్యం వెంకటరమణ రూ.6వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రమాదంలో గాయపడిన విజయ్‌కి మెదడుకు దెబ్బ తగలడంతో ఆ కుటుంబాన్ని చికిత్స చేయించుకోలేని స్థితిలో ఉన్నారని తెలుసుకొని తమవంతుగా ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు.

## బావాజాన్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు

**ప్రజాశక్తి-కలికిరి**

జాతీయ విద్యా దినోత్స వం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి రచన పోటీలో మండలంలోని మర్రి పాడు గ్రామానికి చెందిన అత్తార్ బావాజాన్ విశేష ప్రతిభ కనబరి చారు. ఈ పోటీలో ఆయన మొబైల్ ఫోన్ వల్ల లాభాలు, నష్టాలు, సమాజంపై ప్రభావం అనే అంశంపై ఆలోచ నాత్మక కథను రాశారు. ఈ కథ నేటి తరం యువత సులభంగా అర్థం చేసుకునే రీతిలో, ప్రభా వవం తమైన శైలిలో రాసినందుకు ఆయనకు మంచి గుర్తింపు లభించింది. ఆయన సాహిత్య ప్రతిభను, సృజనాత్మకతను గుర్తించిన ఉర్దూ అకాడమీ డైరె క్టర్ షేక్ మొహమ్మద్‌గౌస్‌పీర్ రాష్ట్ర స్థాయి అవార్డు కోసం ఎంపిక చేశారు. ఈ పురస్కారాన్ని పీలేరు ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ రెడ్డి బావా జాన్‌కు అందజేశారు. యువ రచయితలు భవిష్యత్తులో ఉర్దూ భాషా అభివృద్ధికి, సాహిత్య ప్రగతికి తోడ్పడాలని ఆకాంక్షించారు.



బావాజాన్‌కు అవార్డు అందిస్తున్న ఎమ్మెల్యే







యువజనోత్సవాల్లో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

## స్వర్ణాంధ్ర సాధనలో యువశక్తి కీలకం

**ప్రజాశక్తి-రామాపురం**

స్వర్ణాంధ్ర సాధనకు యువశక్తి కీలకమని రాష్ట్ర యువజన క్రీడల రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని భాస్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో మంగళవారం జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజనోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద పుట్టిన రోజున జాతీయ యువజన దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. భారత ప్రధాని వికసిత భారత్-204, రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్ణాంధ్ర-2047 సాధనలో కీలక భూమిక యువ తరాదిదని చెప్పారు. క్రీడల్లో వ్యవసాయ రంగంలో సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ రంగాలలో దేశానికి ఆదర్శంగా ఆంధ్ర ప్రదేశ్ యువత ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసులు శాఖ సిఇఒ జోయల్ విజయ్ కుమార్, బిట్స్ కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్, ప్రిన్సిపల్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**చిన్నమండెం :** మండల పరిధిలోని బోరెడ్డిగారిపల్లెలోని తన నివాసం వద్ద మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అధికారులకు చరవాణి ద్వారా మాట్లాడుతూ ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా న్యాయపరమైన సమస్యలను త్వరితగతిగా పరిష్కరించాలని సూచించారు.అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ లబ్ది చేకూరేటట్టు ప్రణాళికను చేపట్టి ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరాలన్నారు. ఎవ్వరిని ఇబ్బందులకు గురి చేయకుండా అధికారులు సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదలకు భరోసా సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-పుల్లంపేట :** సిఎం సహాయనిధి పేదలకు భరోసానిస్తుందని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం ఓబులవారిపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన అనారోగ్య కారణాలవల్ల ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు సిఎంకు సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. వై.కోట గ్రామానికి చెందిన జ్ఞానం కొండా నాగేంద్రకు రూ.43,961లు, దౌలతిబికి రూ.30,786లు, ఆది నారాయణకు రూ.37,114లు, కొటారు హరి నర్సింహులుకు76.084లు, మంగంపేట గ్రామానికి చెందిన దాసరి ప్రభావతి కి రూ.25,655లు అందిం చారు. అదే గ్రామానికి చెందిన దేశం శివయ్యకి రూ.9200లు, పుల్లగంటి అరు ణకి రూ.25వేలు, కొత్త మంగంపేట గ్రామానికి చెందిన పేరూరి వెంకట సుబ్బమ్మకు రూ.1,48,799లు వారి ఇళ్ల దగ్గరికి వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం సహాయనిధి అనేది సాధారణ కుటుంబాలకు ధైర్యా న్ని ఇస్తుందన్నారు.అర్హత గల బాధితులకు సాయం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రైం కార్నర్



నిందితులను అరెస్టును చూపుతున్న పోలీసులు

## ఇద్దరు నకిలీ సిబిఐ అధికారులు అరెస్టు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

వాట్సాప్ ద్వారా కాల్స్ చేసి, అమాయక ప్రజలను భయపెట్టి డబ్బులు దోచుకుం టున్న నకిలీ సిబిఐ అధికారులు వెంకటేష్, వినోద్‌యాదవ్‌ను మంగళవారం అరెస్టు చేసి డిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డిఎస్‌పి మహేంద్ర, టూటౌన్ సిఐ రాజారెడ్డి తెలిపారు. స్థానిక రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ సిబిఐ అధికారులుగా నమ్మించి డిజిటల్ అరెస్టు పేరుతో 72 ఏళ్ల వృద్ధురాలి నుంచి రూ. 36 లక్షలు వసూలు చేసిన కేసులో వీరిని అరెస్టు చేశామన్నారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లోని రూ.97 లక్షలను పోలీసులు ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వినోద్ ఆదేశాల మేరకు, మరో నిందితుడు వెంకటేష్ ఢిల్లీ వెళ్లి అక్కడి సైబర్ నేరగాళ్ల ముఠా సాహు, దీపక్, జాక్‌తో కలిసి ఒక హోటల్ గదిలో కుట్ర పన్ని మదనపల్లె పట్టణానికి చెందిన గర్లా కృష్ణవేణమ్మ(72)కు వాట్సప్ కాల్ చేసి తాము బెంగళూరు సిబిఐ అధికారులమని నమ్మబలికారన్నారు. మీ ఆధార్ కార్డు ఒక హ్యూమన్ ట్రాఫికింగ్ కేసులో ఉందని త్వరలోనే నిన్ను, మీ కుటుంబాన్ని అరెస్టు చేస్తామని కృష్ణవేణమ్మను భయపెట్టారు. భయపడిన కృష్ణవేణమ్మ మొత్తం రూ.36 లక్షలను వారు చెప్పిన వివిధ బ్యాంకు ఖాతాలకు కొద్దికొద్దిగా డిపాజిట్ చేసిందన్నారు. అనంతరం వారిపై అనుమానం వచ్చిన కృష్ణవేణమ్మ మదనపల్లి రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన సిఐ, సైబర్ టీం, ఐడి పార్టీలతో ముమ్మర దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో ముద్దాయిలు వెంకటేష్, వినోద్ లను పీలేరు టౌన్, రైల్వే గేట్ వద్ద అదుపులోకి తీసుకొని, వారి బ్యాంకు అకౌంట్లో ఉన్న రు. 97 లక్షలు ఫ్రీజ్ చేశారు. వారి మొబైల్ ఫోన్లను కూడా సీజ్ చేసి వారిద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సైబర్ మోసాల్లో భాగంగా, కొందరు వ్యక్తులు వాట్సాప్ ఫోన్ కాల్స్ ద్వారా అమాయక ప్రజలను ట్రాప్ చేస్తున్నారని, నకిలీ గుర్తింపు కార్డులు, పోలీస్ యూనిఫాంలో ఉన్న వ్యక్తులను వీడియో కాల్స్‌లో చూపించి, తాము సిబిఐ అధికారులుగా నమ్మించి, భయపెట్టి డబ్బులు దోచుకుంటు న్నార న్నారు. అలాంటి కాల్స్ వచ్చిన సమయంలో సమీపంలోని పోలీసులకు సమా చారం ఇవ్వాలన్నారు. ప్రస్తుత కేసులో అరెస్టయిన వినోద్, వెంకటేష్ వాట్సాప్ కాల్స్ కాంబోడియా ఐపి అడ్రెస్‌ల ద్వారా రూట్ చేయడం, నకిలీ ఎఫ్ఐ ఆర్, ఇడి, సిబిఐ, నోటీసుల్లాంటి ఫోర్జరీ పత్రాలను బాధితులకు పంపి డిజిటల్ అరెస్ట్ పేరు తో బాధితులను భయపెట్టి డబ్బులు వసూలు చేయడం జరుగుతోందన్నారు. డిజి టల్ అరెస్టు మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పుడూఫోన్ ద్వారా డబ్బులు డిమాండ్ చేయరనే విషయాన్ని గ్రహించాలన్నారు

## రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

**ప్రజాశక్తి-ములకలచెరువు**

మండలంలోని పెద్దపాళ్యం ఫ్లై ఓవర్‌పై ఈ నెల 7న పిటిఎం ఎస్ఐ కారు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో సత్యసాయి జిల్లా మహ్మదాబాద్‌కు చెందిన సుల్తాన్‌కు తీవ్రగాయాలు కావడంతో తిరుపతి రుయాకు చికిత్స పొందు తున్నారు. ఈ కేసులో పిటిఎం ఎస్ఐ కారును నడిపిన కానిస్టేబుల్ మౌలాలీని కేసులో లేకుండా చేసేం దుకు పోలీసులు సకల ప్రయత్నాలు సాగించారు. ఈ ఘటనపై పోలీసు శాఖకు వ్యతిరేకంగా సామాన్య ప్రజలకు ఒక న్యాయం పోలీసు శాఖకు ఒక న్యాయమా అంటూ పత్రికల్లో కథనాలు వెలుబడడంతో ఉన్నతస్థాయి అధికారులు పోలీసులకు మొటిక్కాయ వేసినట్లు సమాచారం. బాధ్యులపై కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో ఎట్టకేలకూ మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ హరిహరప్రసాద్‌కు చెందిన కారు ను నడిపిన కానిస్టేబుల్ మౌలాలీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్ఒ రమణ తెలిపారు. .